# పెళ్ళికూతురు పిలిచింది

సప్త సముద్రాలూ దాటాక బంగారు కొండ.

ఆ కొండమీద వెండి కోనేరు. ఆ కోనేరులో సువర్ణ మందిరం... ఆ మందిరంలో...ఇలా కథల్లో చెప్పినట్టు ఆ వూరులో మావాళ్ళ ఇల్లు కనుక్కొందికి బ్రహ్మ ప్రయత్నం చేస్తున్నాను. ఎవరిని అడిగినా 'అదుగో తిన్నగాపోయి నాలుగు రోడ్లూ కలిసేచోట అడగండి' అని. అక్కడ అడిగే సరికి 'అలా మలుపు తిరిగితే వేపచెట్టు అక్కడ కిల్లీల కొట్టూ' అక్కడ అడగండి అనీ, తీరా అక్కడికిపోయి అడిగితే, "అబ్బే ఇంతదూరం ఎందుకొచ్చారండీ మళ్ళీ వచ్చిందారంటే మూడు ఫర్లాంగులుపోయి అక్కడ ఎడం చేతి ప్రక్క సందులో ఒకటి...రెండు నాలుగో మలుపులో...ఒక కాఫీక్లబ్బు...దానికి ఎదురుగుండా" యిదీ వరస ఇలా గానుగెద్దులా తిరగడమే అయిపోతూంది.

ఆఖరికి ఒక మారుమూల వీధిలోకి యీ దారి చూపే దానయ్యల వల్ల అట్టా చెమ్మాలో పిక్కలాగ నెట్టబడ్డాను. అక్కడ ఒక కిల్లీకొట్టు వాడిని అడిగేసరికి.

"అదుగో ఆ సంగీతం వినపట్టంలేదటండీ అక్కడే వున్నారు" అని అన్నాడు.మావాడు సంగీతం మాష్టరే కాబట్టి నిజమనే నమ్మకం కలిగింది. దగ్గరగా ఆ యింటికి వెళ్లేను. సంగీతం పాఠం వినబడుతోంది. అది పాఠమేగాని పాటగాదని ఎలా చెప్పగలిగేనంటే ఆ గొంతులోనూ,

పాటలోనూ, తేడా కచ్చేరిచేసే విద్వాంసులకిన్ని పాటాలు చెప్పుకునే సంగీతం మాష్టర్లుకిన్ని వుంటుంది.

కొంచెం లోపలికి తొంగి చూసేసరికి కర్టెను కట్టివున్న అ గదిలో చుట్టూ సభతీర్చి ఎంతోమంది ఆడవాళ్ళు ముస్తాబులయి కూర్చున్నట్లు అనిపించింది. ఎవళ్ళంటే నాకేం అని కాస్సేపు ఆగి పిలుద్దామా? లేక లోపలికే వెళ్ళిపోదామా? అని తటాపటాయిస్తున్నాను.

ఇంతలో ఒక పదేళ్ళ పిల్లడు ఇవతలికివస్తే దగ్గరికి పిలిచి— ఎందుకయినా మంచిదని-

"వోయ్ మాస్టరుగారుంటే పిలువూ?" అని అడిగాను.

ఇవతల ఎవరో అలా అడుగుతారని కాచుక్కూచున్నట్టు— గాత్రం కట్టిపెట్టి, అందరూ గుప్‌చిప్‌గా వింటున్నారు.

ఆ అబ్బాయి లోపలకి వెళ్ళి 'మాస్టారుగారిని పిలుస్తున్నార'ని చెప్పేడు. తిరిగి వచ్చి "ఎవరూ? అని అడుగుతున్నారని" చెప్పేడు.

ఆ ప్రశ్న కొంగు పట్టుకునే రెండు మూడు మొఖాలు-నాటకం మొదలెట్టేముందు స్టేజిలోంచి తెర సందుల్లోంచి పైకి వచ్చే తలల్లా పైకి చూసి ఆ ఇంతలోనే నిష్క్రమించేయి.

వెళ్ళక వెళ్ళక వెళ్ళినవాడిని వెంటనే స్వాగతం చెప్పక ఈ ఆలస్యం ఏమిటని "మీ కోసమే అని మీ వాళ్ళే అని చెప్పవోయ్" అని వేళాకోళంగా, పోకట్ రుమాలుతో మొహం తుడుచుకుంటూ అన్నాను. దానికయినా ఆ మేష్టారు, ఇవతలికొచ్చి నన్నుచూసి, గతుక్కుమని "నువ్వట్రా" అని ఎత్తుకు మరీ తీసుకు వెళతాడని.

లోపల వాళ్ళేం అనుకున్నారో ఏమో మరి కొన్ని మొహాలు తెర తొలగించి చూసేయి—చూసి నా వాటం చూసి అదోలా అయిపోయి కొంగులు అడ్డం పెట్టుకు కిసుక్కున నవ్వుకుంటూ, మాటల్లేకుండా ఏమిటో సంజ్ఞలు చేసుకొని లోపలకి తుర్రుమన్నారు. అదంతా ఏమిటో మూకీ చిత్రంలా అనిపించింది.

అంతలో తెర తప్పించుగొని ఒక అబ్బాయి ఇవతలకి వచ్చి-

"రండి రండి దయచేయండి లోపలకి మీ కోసమే చూస్తున్నాం" అని నేను ఆశ్చర్యపోయేట్టు అన్నాడు.

ఇతనెవడు? నే పిలిచినతడు రావడం మాని ఈ రాయబారాలు ఎందుకో అని విసుపోతూ లోపలికి వెళుతూనే మళ్ళీ "మేష్టరుగారున్నా రండీ" అని జ్ఞాపకం చేసేను-నా బాధ నాది.

"వున్నారు రండి" అని లోపలికి తీసుకువెళ్ళి సింహాసనంలాంటి కుర్చీలో కుర్చోమన్నాడు. ఆ వాతావరణం కొత్తది, మా వాళ్ళన్న వాళ్ళెవళ్ళూ లేరు. అంతవరకూ సంగీతం పాఠం చెప్పినాయనా లేడు... చాలాకాలం అవడంవల్ల, ఆ గొంతు పోల్చలేకపోయానేమో మరి అక్కడ ఒక ప్రౌఢ నిలబడివుంది అన్న సంగతి, తల వంచుకుని 'ఎక్కడికి వచ్చా'నని ఆలోచిస్తున్న నాకు ఆవిడ "వచ్చేరా మీ సంగతే అను కుంటున్నాం. అంతా కులాసాయేనా అంటేనేగాని తెలిసిందికాదు 'ఎవరు చెప్మా అని' చూడక తప్పక చూసేసరికి—

"నా సంగతి వీళ్ళకెలా తెలుసూ? నేవచ్చిన మేస్టారు తాలూకా వాళ్ళుకారే! నా గురించి వీళ్ళేం పొరబడలేదుకదా?" అని అనుకున్నాను. ఆ మాస్టరింకా లోన వున్నాడేమో వస్తాడని ఇంకా ఆశపడుతున్నాను.

ఎవరో వెండి ప్లేటులో టిఫిను పట్టుకు వచ్చేరు. మరో వెండి గ్లాసుతో కాఫీ—ఆ వెనకాల ఓ నలభై, ఏభై, ఏళ్ళ మనిషి వచ్చేడు. వచ్చి—

"ఓహో కులాసా?" అని అంటూ పక్కన కూర్చున్నాడు. నేను వీళ్ళందరికీ తెలుసుగాని నాకు తెలియదు! ఏమిటో ఎక్కడా గుక్క తిప్పడానికి వీల్లేకుండా వుంది. నన్ను వాళ్ళేం మాట్లాడనివ్వడంలేదు. ఇందాకటి అబ్బాయి అక్కడ హార్మణి వుంటే కూర్చొని ఉండబట్టక గాలి కొడుతూ శృతి వేస్తున్నాడు. టిఫిను నాముందు పెడుతూ "పుచ్చు కోండి" అన్నాడా పెద్ద మనిషి.

"అప్పే...ఇప్పుడు ఇదేమిటండి...నేను..."అని నేను మోమాట పడుతూ నా జన్మలో జరగని ఈ రాజ పూజ్యానికి, ఉబ్బి తబ్బిబ్బయి బెక్కుకూ అన్నాను.

"అలాగంటారని తెలుసు! అయినా తీసుకోండి. తప్పులేదు" అని బలవంతం చేసారు. వెనక గుమ్మం అవతల కొన్ని ఆడవాసనలు వేస్తున్నాయి. ఇక తప్పక, అది తాపీగా పుచ్చుకున్నాను...కాఫీ త్రాగి కళ్ళ దగ్గర్నుంచి కప్పు తీసి క్రింద పెట్టేసరికి—ఎదురుగుండా ఇద్దరమ్మాయిలు కూచొని వున్నారు. మరో ఇద్దరు స్త్రీలుకూడా వున్నారు ప్రక్క.

ఆ అమ్మాయిలు అతి సిగ్గుతో...వెనకనించి పొడవగా పొడవగా స్ప్రింగులా వెనక్కి తన్నుకుంటూనే వచ్చి ముడుచుకు ముద్దయి కూచున్నారు మనలో మనమాట—చెప్పకేం—ఆ ఇద్దరిలో ఒక అమ్మాయి చిన్నది...అక్కకన్నా బాగా వున్నట్లు అనిపించింది... ఎవరెలా వుంటేనేం? తప్పు! పై వాళ్ళ ఇంటికి వచ్చి మేస్తూ—యిదా వరస. కృతఘ్నత! పర స్త్రీలని తల్లుల్లా చూసుకోవాల్సింది! అని అనుకున్నాను. మీరేమనుకున్నా...ఆ సమయంలో నేనొక స్వర్గంలో ఉన్నట్టయింది. ఈ వింత సంఘటన ఏమిటి?...అని ఆలోచించడానికయినా వాళ్ళు నాకు టయిము ఇవ్వలేదు.

ఒకామె అందులో పెద్దపిల్ల మొహాన్ని పైకెత్తుతూ—

"ఈ పిల్లని గురించే మా వాళ్ళకి కాస్త! అని అన్నది. తిరిగి వెంటనే "చూపులు అయిపోతే నిర్ణయించుకోవచ్చు" నిఅ కూడా అంది!

ఆ మాటలు వినగానే నేను గాలిలో తేలిపోతున్నానా! అనిపించింది. సినిమాలో లాగ—నోరు వెళ్ళబెట్టి, గుడ్లు పైకిబెట్టి—పిలిచినా పలక్కుండా అయిపోతానా అనిపించింది.

ఆఖరికి భగవంతుడే సంసార సముద్రంలోకి తీసుకొచ్చి పడేశాడా నేను ఎక్కడికని బయలుదేరాను! వచ్చినపని ఏమిటి? ఏం జరుగుతూంది? అని తట్టుకోలేక పోతున్నాను. అప్పటికి విషయం కొంతవరకూ అర్థ

మయింది. ఇకను ఏమన్నా ఏం ప్రయోజనం? వాళ్ళు వినిపించుకునేటట్టు లేరు. చెప్పవలసిందేదో ముందే చెప్పుకోవలసింది. చెప్పనిచ్చారుకాదు. అయిందేదో అయింది ! 'యింక' ఎప్పటి కెయ్యది ప్రస్తుత మన్నట్టు వూరుకొని ఈ మర్యాదమీదే చల్లగా జారుకుంటే ఉత్తమం. అంతేగాని యిప్పుడేం చెప్పినా...వాళ్ళకి చిన్నతనం, నాకూను...కానీ ఇందులో తప్పేమిటి? చూడ్డానికి వచ్చిన పెళ్ళికొడుకుల్లో నేనొకడిని!

మా సంగీతం మేష్టారే అని పొరబడ్డ. ఆ సంగీతం మేష్టరు... శృతి సర్దడం అయి సరిగమలు పలికిస్తున్నాడు.

"పాడమ్మా!" అని అన్నారు అందరూ.

ఆ పిల్ల ఓ పావుగంట వరకూ గింజుకుంది...పాడకపోతే ఆ పరీక్షలో ఫేల్ అయిపోతానేమోనన్న భయంతో గొంతు ఎత్తింది.

నా పెళ్ళానికి పాటవస్తేనేగాని వీల్లేదనుకొనే పెళ్ళికొడుకుని కాదు కాబట్టి ఏదో ఆ పెళ్ళి కోసరం మాత్రమే నామహః "మా అమ్మాయికి సంగీతం వచ్చు" అనే నేటి ఆడపిల్లల వివాహానికి కావలిస్తే ఆ క్వాలిఫికేషన్ కోసరం...నెలో...పదిరోజులో...క్రిందటినుండి నేర్చుకొన్నట్టు వుంది. కొందరయితే...ఆ నాలుగురోజుల్లోనే ఒక మేష్టర్ని పెట్టి రెండు సినిమాపాటలూ, మూడు కృతులూ ఇలా రకానికొకటి కంఠస్థం చేయించి చెప్పేవరకూ ఆ మేష్టరు ప్రాణాలు తీసి "సంగీతం" వచ్చునని అనిపించేస్తున్నారు. ఆ రిలే పాట విని ఆ ముందా పెళ్లి కొడుకు "పెళ్ళయ్యాక 'ఏడుకొండలవాడ' అని భార్యారత్నం పక్కలో కూచుని పాడితే ఎంత బావుంటుందో" అని ఏమిటీ అప్పటినుండే వూహించుకొని మురిసిపోతాడు...తీరా అయ్యాక మోసపోతాడు.

ఇలా నేనేవో ఆలోచనల్లో పడిపోయివుంటే "అమ్మాయి పోర్తు ఫారం చదివింది" అన్నారు. ఇదోస్టంటు— ఎందుకంటే సాధారణంగా ప్రస్తుతం—యీ పెళ్ళిళ్ళలో ఆడపిల్లలకి కొన్ని క్వాలిఫికేషన్‌లు ఉండాలి.

చదువు, సంగీతం రావాలి. అందంగా వుండాలి, షోగ్గా వుండాలి, తూకపు వంటలు రావాలి, అంటే "వంకాయ ముద్ద ఎట్లు చేయుదువు?" అనగానే దానికి "ఇన్ని తులాలు మిరపకాయలు, ఇన్ని తులాల ఉప్పు, ఆవాలు మొదలైనవి వుండాలి" అని "ఇన్ని జొన్ను నీళ్ళుపోసి ఇన్ని నిముషాలు లేక గంటలు ఉడికించాలి!" అని కొలతలతో సహా చెప్పగలిగి ఉండాలన్నమాట! ఇవి వున్నాక యింకా—

స్కూలు ఫైనలుచదివిన పెళ్ళికొడుక్కి వేయినుండి రెండు వేల వరకూ, ఆపైన బి.ఏ.లోపున అయితే అయిదు, పదివేలమధ్య, బి.ఎకి పైకి చదివిన వాడయితే పాతికవేలవరకూ, ఇలా గ్రూపులనిబట్టి కూడా ఇచ్చే స్తోమత ఆ పిల్ల తల్లిదండ్రులు కలిగివుండాలి! ఇదంతా చూస్తుంటే నేడు పెళ్ళికొడుకులందరూ కట్నాలకోసమే చదువుతున్నారేమో అని పిస్తూంది! ఎంత ఎక్కువ చదివితే అంత ఎక్కువ లాగొచ్చు. అందుచేత "చదువుకుతగ్గ కట్నం" అనే సబ్జెకుని కనీసం నాండిటెలుగానైనా పెట్టి నేర్పిస్తే కట్నాలు తీసుకోడంతో విద్యార్థులకి సహాయపడ్డ వారవుతారు విద్యాశాఖవారు.

ఉద్యోగం చేస్తున్న పెళ్ళికొడుక్కి ఒకవిధమైన కట్నం, లేని వాడికి ఒకరకం- ఉద్యోగం లేనివాడికైతే 'ఉద్యోగం కూడా మేమే వేయించుకుంటాం' అని హామీ ఇవ్వాలి ఆ పిల్ల తల్లినండ్రులు. తమ కూతుళ్ళకి ఇచ్చాంకధా అని కొడుకులకి కూడా పుచ్చుకుంటారు! ఆ పెళ్ళికూతురుకూడా ఎలా తయారవుతుందంటే తాను కట్నం యిచ్చి పెళ్ళాడింది కాబట్టి తన కోడలుదగ్గర కూడా పుచ్చుకుందామని చూస్తుంది ఇక పెళ్ళికొడుకుల తండ్రులనిచూస్తే తాము కోరినకట్నం ఇస్తే చాలు— కోడలు ఎలావున్నా సంబంధంలేదు. ఒకవేళ తమ కొడుకులకి కట్నం పుచ్చుకోవడం ఇష్టంలేకపోయినా అన్నచెల్లెళ్ళకి కట్నాలివ్వాలనో, నీ చదువుకయిన ఖర్చు ఈ మూలంగానైనా తీయాలనో, లేక పెళ్ళిఖర్చుకి డబ్బులేదనో ఏవో కారణాలు, సాకులూచెప్పి వారిని వంచి, ఒప్పించి, పెళ్ళిపెద్దలవుతారు.

కట్నం ఇచ్చుకోలేక ఆడపిల్లల తల్లిదండ్రులు ఆ కూతుర్ని మనసులో 'చెడబుట్టిందని' 'శత్రువని' ఖర్చుచేయించే ఒక పీడ' అని తిట్టుకుంటూంటారు. ఎంతోకొంత ఇచ్చేసి వదుల్చుకుంటే చాలని చూస్తారు. అంతేగాని అవతల ఆ పెళ్ళికొడుకెలాంటివాడు? వంశం, గుణం, మర్యాద వయసూ, ఆరోగ్యం, సాంప్రదాయం, ఉద్యోగం, ఉనికి, తాహతు ఇవేవి వున్నాయో—లేవో! అని ఆలోచించరు. ఏదోవిధంగా ఆ పెళ్ళిచేసేం అనిపించేసుకొని ఆ పిల్లని అత్తారింటికి పంపించివేస్తే చాలు! ఆ తర్వాత ఆమె ఎలా జీవితం గడిపినా అక్కర్లేదు. ఈరోజుల్లో మనస్తత్వాలు ఈవిధంగా వున్నాయ్. ఇలాంటి ఆలోచనలతో నేను ప్రస్తుతం మరచిపోయేను. ఈ ప్రపంచంలో ఉన్న వాళ్ళందరికి ఎలాకనబడ్డానో ఏమో!

"మీరూ... మీరూ... చూసుకున్నారు కదా! హూ అంటే ముహూర్తం పెట్టించి మూడుముళ్ళా వేయించేస్తా" అని అన్నాడు పెద్ద మనిషి.

హతోస్మి! అన్యాయం! ఘోరం! పాపం! ఏ పెళ్ళికొడుకు చూడ్డానికి వస్తానని ఈరోజు ప్రోగ్రాం ఇచ్చేడో నేనక్కడ ఖర్మకొద్ది ఇరుక్కున్నాను? వారిని ఇంత మోసంచేసి నేనెలా మాటివ్వగలను? నాకు నచ్చకేం? చేదా? లేక అదేం జంతువా? వస్తువా? ఆడపిల్ల నచ్చకపోవడం ఏమిటి? నచ్చితేమాత్రం? బాగానేవుంది. ఈ పొరపాటు గురించి వాళ్ళకెలా తెలియచెప్పడం? చెబితే ఎంత అవమానం అంతవరకూ కొండ ఎక్కించిన నన్ను గొంగళిపురుగులా దులిపేసుకోక ఏంచేస్తారు? ఐనా ఆ వస్తానన్న పెళ్ళికొడుకు ఎంచేత రాలేదో? అంతే అయివుంటుంది— వాళ్ళు పెళ్ళికొడుక్కోసం నిరీక్షిస్తున్నారు. నేనేదో వేరేపనుండి అక్కడకి వస్తే సమయానుకూలంగా నన్నే ఆ పెళ్ళికొడుకనుకోవాలా? ఇందులో నా తప్పేముంది? అయిందేదో అయింది ఇంక బయటపడాలి అనుకొని—

"అలాగేనండి వెళ్ళగానే మావాళ్ళతో చెప్పి ఉత్తరం వ్రాస్తాము" అని అచ్చంగా పెళ్ళికొడుకు లాగానే సాంప్రదాయ సిద్దంగా అన్నాను.

"మీ అభిప్రాయం చెబితే అందరం ఆనందిస్తాం" అని అందరూ అన్నారు. నా నోటంటా ఆమాట రాలితే అంత ఆనందంట పోనీ అంతలా అంటూంటే అనేద్దాం అనుకున్నాను కాని ఏమిటి లాభం? నేనెవరు? నాకువారికీ ఎమిటా సంబంధము? నా అభిప్రాయం వల్ల వారికేం లాభం?

నా అభిప్రాయం కోసం వాళ్ళందరూ నిశ్శబ్దంగా ఆత్రుతతో వింటున్నారు పెళ్ళికూతురు గుండె బితుకు బితుకుమంటోంది కాబోలు.

"నాకేమో బాగానే వుందండి" అన్నాను సిగ్గుపడుతూ. ఐతే ఆ సిగ్గు దానంతటదే స్వభావసిద్ధంగా వచ్చేసింది. ఆశ్చర్యం ఆ ముక్క అంటున్నప్పుడు పెళ్ళికొడుక్కివుండే భావాలే వున్నాయ్.

ఆ మాట నానోటినుండి జన్మించగానే ఆ ఇద్దరమ్మాయిలూ అక్కడనుండి పారిపోయారు. వారికి కావలసిన నా అభిప్రాయం ఆ పెద్దమ్మాయి గురించి. కాని నిజంగా నన్నే అలాపిల్చి "నీకు నచ్చిందా" అని అడిగితే ఆ చిన్నదాన్ని 'బావుంది' అని అనేవాడిని.

ఇంక విదిలించుకు బయటపడదాం అని లేచేసరికి వీధిలో జట్కా ఆగినశబ్దం అయింది. ఇదేనండి 'కామేశ్వర్రావుగారి ఇల్లు' అని అంటూ ఆ జట్కావాడు ఆపేడు. ఏమిటో అని అందరూ అటు తిరిగేరు. ఆ జట్కాలోంచి టిప్‌టాప్‌గా తయారైన నా వయస్కుడే ఒక కుర్రాడు, అతనితో ఒక ప్రౌఢస్త్రీ దిగేరు. వీళ్ళకి వాళ్ళెవల్లో తెలీదు కాబోలు. ఒకళ్ళ మొహాలొకళ్ళు తెల్లబోయి చూసుకొని మర్యాదకోసం "రండి లోపుకి" అని అన్నారు. వాళ్ళు వచ్చేరు. కూచో కూచోమని మర్యాద చేసి ఏం పలకరించడానికి తోచక వూరుకున్నారు.

'బండి' లేటు కావటంచేత ఆలస్యం అయిపోయిందండి. ఆ తరువాత మేం దిగేవేళకి దుర్ముహూర్తం వుందంటే పిల్లనెలా చూస్తాం అని అది పోయేవరకూ స్టేషన్‌లోనే వుండి యిలా వచ్చేం. "చూసి, మీరు రాలేదనుకున్నారు కాబోలు" అని అన్నది ఆమె. ఆ కుర్రవాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ, ఎందుకో అన్ని ప్రక్కలా గాలిస్తున్నాడు కళ్ళతో—

ఇంకా అర్ధంకాదా? వాళ్ళందరూ నిలువునా నీరయిపోయి నావేపు అయోమయంగా చూశారు. నానోట్లో వెలక్కాయ పడింది. అప్పటి నా పరిస్థితి ఏం చెప్పేది? వాళ్ళ మొహం ఎలా చూసేదీ ? నాగుండె టాక్కు మని ఆగిపోతే బావుంటుందని పించింది. అందరికళ్ళూ నా మీదపడి దహించి వేస్తున్నాయి...అపద్బాంధవా ? ఈ ఆపద నుండి, ఈ పరాభవం నుండి రక్షించవా ? ఏం జవాబు చెప్పి నా నిర్దోషత్వాన్ని రుజువు చేసుకునేది? నా నోటంట మాట రాపడంలేదు. నేనమాయకుడినని నిరూపించడానికి సాక్ష్యం లేదు. నేనేపాపం ఎరగక పోయినా వాళ్ళ దృష్టిలో నా అంత మోసగాడూ, దగుల్బాజీ వుంటాడా ?

భరించలేని భయంకరమైన నిశ్శబ్దం...వాళ్ళందరూ విస్తుపోయి, ఏం చెయ్యడానికీ తోచని నిముషం. ఒక్క నిముషం ఆలస్యం—అయితే నా కయ్యే సన్మానం విశేషం...ఇలాటి పుణ్యకాలంలో...

"అందరూ వచ్చినట్టున్నారే" అని అంటూ వచ్చేడు...నేనను కున్న మేష్టరు నేనెవరికోస మయితే వచ్చేనో...ఆ సంగీతం మేష్టరు... నా బంధువు. అయిన పంతులు అతను రాగానే నా కంటికి గజేంద్రుని కష్టపడిన సుదర్శన చక్రంలాగా, ద్రౌపదిని కాపాడిన పట్టుచీరలాగ అవుపించేడు...నన్ను చూస్తూనే–

"అరె చంద్రం నువ్విక్కడున్నావట్రా" అన్నాడు ఆ సంబోధ నతో–

అక్కడున్న వాళ్ళందరూ మరీ బిక్కచచ్చిపోయి...ఒక్క ఘడియ మూర్ఛపోయినట్టయినారు. అది కోపమో, ఆశ్చర్యమో, ఏడుపో తెలియక–

"ఇతన్ని మీకు తెలుసా ?" అని ఆయన్ని అడిగారు. నామీద వాళ్ళకి గౌరవం పూర్తిగా పోయినట్టుంది.

"బావుంది. తెలియక పోవడం ఏమిటండీ...వీళ్ళవాళ్ళకి కూడా ఉత్తరం రాసారా ఏమిటి? పెళ్ళిచూపులకి రమ్మని...నాతో చెప్పలేదే ?

అయినా ఏంరా? మా ఇంటికి మొదట రాకుండానే అత్తవారింటికి సూటిగా వచ్చేశావూ?" అని హాస్యం ఆడుతున్నాడు...ఛస్తూంటే...

"ఇతనెవరు? ఇతనికి మేమేం ఉత్తరం వ్రాయలేదే...పెద్దమ్మాయి కోసం చూసిన సంబంధం వారికే చూపులకి రమ్మని వ్రాసాం...ఇవాళ వస్తున్నామని వాళ్ళు వ్రాయగానే చూస్తూ కూచున్నాం. ఇంతలో ఈ మహానుభావుడు వచ్చేడు. ఇతనే ఆ పెళ్ళికొడుకు ఒక్కడూ వచ్చేడు కామోలు అనుకొని...రమ్మన్నాం. ఇంతవరకూ జరగవలసిందంతా జరిగింది. ఇదిగో ఇప్పుడే వీళ్ళ బండీ లేటయిందని ఆలస్యంగా వచ్చేమంటూ అసలు వాళ్ళు జట్కా దిగి వచ్చేరు. ఇంత జరిగింది...పోనీ...తను కాదు...ఏమిటిదంతా? అని ఒక్క ముక్కయినా అనలేదు చూడండి. ఆ అబ్బాయి మంచి మర్యాదస్తునిలాగానే వున్నాడు? అని వర్ణిస్తూ—

"ఎవరబ్బాయివి బాబూ! ఇలా ఎంతమందిని మోసం చేస్తున్నావు? బ్రతుకు తెరువు బాగానే కనిబెట్టేవే" అని వెటకారంగా అన్నారు.

ఆ ఆ ఆగండి వాడినేం అనకండి? అతనెవరోకాదు మొన్ననేచెప్పేనే...మా పినత్తగారి కొడుకు...చంద్రం! మంచి వాడూ, బుద్ధిమంతుడూ మీ రెండోపిల్లకి ప్రయత్నం చెయ్యండీ!...అని...వాడే వేడు-వీడిని ఇక్కడచూసి-నాకు చెప్పకుండానే మీరు...ఇతడిని పెళ్ళి చూపులకి...పిల్చేసేరు కాబోలు ననుకున్నాను!-అయినా చంద్రం ఘటివాడివే! పిలవకండానే వచ్చేశావ్! అని అన్నాడు...నా అవస్థ వాళ్ళకేం అర్థమవుతుందీ నాకు కోపం వచ్చిందీ. కాని ఎవరిమీదచూపను?

"అంతా నీనించే వచ్చిందయ్యా బాబూ....అసలు వీళ్ళెవళ్ళో...వీళ్ళింటికెలా వచ్చేనో ఇదంతా ఏమిటో? ఈ గొడవే నాకు తెలియడం లేదు...నిన్ననే నాకీ ఊళ్ళో నౌఖరీ అయితే వచ్చాను! నువ్వున్నావు కదా! వద్దాం అంటే నీ ఎడ్రసు తెలీదు! నానాబాధపడీ...నీ పేరుచెప్పి-ఆ సంగీతం మేష్టరు ఎక్కడుంటాడు? అని అడుగుతూ తిరగ్గా తిరగ్గా-అదుగో ఆ కిళ్ళీలకొట్టు వాడు చెప్పేడుకదా..."అదుగో ఆ సంగీతం వినవస్తూంటే...అక్కడున్నావని!" ఈ ఇల్లు చూపెట్టేడు.

నిజంగానే ఈ ఇంట్లోంచి సంగీతం వినిపిస్తూంటే ఇదే కాబోలు నీ ఇల్లని చూడగా ఇక్కడ ఎంతో మంది తెలియని ఆడవాళ్ళు కూచుని వున్నారు. మనవాళ్ళెవరూ కాదని తెలుసుకొని ఒక కుర్రవాడొస్తే "మాష్టరు గారిని పిలువు అని చెప్పాను. లోపల పాడుతున్నది నీవేనను కొని వస్తానని మరి వాడేం చెప్పాడో వీళ్ళేం అనుకున్నారో ! ఏమో ! వీళ్ళందరూ వచ్చి...నన్ను మోమాటం పెట్టి... బలవంతంగా కూర్చో బెట్టి...టీలూ, టిఫినులు ఇచ్చి ఈ గొడవంతా గబగబా హడావుడిగా చేసేసేరు. అసలు నేనేం చెబుదామని అనుకున్నా...చెప్పడానికి అవ కాశం ఇవ్వలేదు. లోపల వచ్చి చూస్తే నువ్వు లేవు...ఇదంతా చూస్తే ఏదో పొరపాటు జరిగి వుంటుందని అనుకున్నాను. కాని ఏం చేసేది విధి లేక ఆఖరికి ఇలా అన్నిటికీ ఊఁ అనేసి మర్యాదగా జారుకోడమే ఉత్తమం అని వూరుకున్నాను. ఇంతలో అసలు వాళ్ళు రావడం జరిగింది దేముడిలా నువ్వు రావడం నేనిదంతా లేకపోతే నేను మోసగాడినని అన డంతో ఆగక తన్నితగిలెద్దురు! అయినా ఇప్పటికీ నమ్మకం లేదులే" అని అన్నాను.

వాళ్ళందరూ అది విని ఫక్కున నవ్వేరు. కాని వాళ్ళలో ఏదో బాధ కనబడింది. ఆ పెళ్ళిపెద్ద అంతవాడూ ఎందుకో తలవంచుకున్నాడు పొరపాటు చేసినట్టు.

"అవున్రా! చంద్రం! వీళ్ళింట్లో పిల్లలకి పాటాలు నేనే చెబు తున్నా. పాట విని నేను ఇక్కడే ఉన్నానని అనుకొని వుంటాడా కొట్టు వాడు. ఈవేళ పనుంది పాటానికి రాలేదు. అడుగో మా అన్నయ్యకొడు కుని పంపించాడు, వాడికీవచ్చు సంగీతం. వాడిని నువ్వెపుడూ చూడలేదు. వాడూ పోల్చుకోలేకపోయాడు! అయినా వీళ్ళేం పైవాళ్ళు కాదులే మన బంధువులే!" అని అన్నాడు పంతులు. హార్మణి దగ్గరవున్న కుర్రవాడు నన్నుచూసి నోరు ఆవలించేడు. ఏదో రాగం తీస్తున్నాడనుకున్నా.

"మరేం అనుకోకు నాయనా? ఇందులో మా తప్పూవుంది.నువ్వూ మాష్టరుగారూ అని పిలవడంచేత నేనూ స్కూలుమేష్టర్నే కాబట్టి" నన్నే

కథా నిలయం
3519
శ్రీకాకుళం



అనుకొని ఇవతలకొచ్చి రాబోయే అల్లుడివి నీవే కాబోలని నిన్ను గుక్క తిప్పుకోకుండా చేసేం. నువ్వు సంగీతం మాస్టరుగారి కోసం వచ్చావని తెలియక పోవడం- ఇంత పని జరిగింది...అయినా ఏముందిలే కొంప మునిగిపోలేదు. మీవాళ్ళకి కూడా ఇవాళో రేపో ఉత్తరం వ్రాద్దామనిఅను కుంటున్నాం. మా రెండోపిల్ల గురించి అనుకోకుండా ఆ భగవంతుడు నిన్ను తీసుకువచ్చాడు. మావల్లే తప్పయింది. క్షమించు. ఏమీ అనుకోకు" అని ఆ ఇంట్లోపెద్ద అనగా అవబోయే మామగారు నా చేతుల్ని పట్టుకొని అన్నాడు.

"ఆడబోయిన తీర్థం ఎదురైందని అంటారు ఇలాగే! అల్లుడుగారు అడక్కుండానే ఇంటికొచ్చారు" అని అత్తగారు కాబోలు అన్నది నవ్వు తూనూ.

"మళ్ళీ వేరే పెళ్ళిచూపులని ఖర్చు పెట్టుకో అక్కరలేదు అయినా అదృష్టవంతులండీ కామేశ్వరరావుగారూ! అలాక్కుదరాలి! సంబంధా లంటే— మీరేం శ్రమపడకుండా అర్థాంతరంగా జరిగిపోయింది. లాంఛ నాలు వదిలేస్తామా? అయినా అబ్బాయిగారి అభిప్రాయం ఏమిటో? వారి తల్లిదండ్రుల యిష్టాయిష్టాలు లేకుండా... తప్పుగదా?" అని ఆయన అన్నారు.

"అదంతా తర్వాత చూసుకుందాం నేనున్నాను కదూ!" అన్నట్లు... మళ్ళీ సభ ప్రారంభించండి. పెద్దల్లుడుగారు వచ్చారుకదా?" అని అన్నాడు. పంతులు... అందరు గొల్లుమని నవ్వేరు. తెర వెనక లేత పాదాలు నాలుగు సిగ్గుతో వెనక్కితప్పుకున్నాయి. ఆ వచ్చిన పెళ్ళి వారు అంతకన్నా ఆశ్చర్యపోయారు! ఆ పెళ్ళికొడుకు అనగా వరసకి తోడల్లుడుగారు నా వేపు అదోలా చూశాడు! నేనతని దగ్గరికి వెళ్ళి — అతని అభిప్రాయం గ్రహించి...

"అభివందనాలు బ్రదర్ ఏమీ అనుకోకు, వదినగారిని నేను మీ తరఫు నుండి చూసి సర్టిఫై చేశాను — ఇంక నా కోరిక ఏమంటే — ఇప్పుడు మీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబోయే పెళ్ళి చూపుల్లో మీ మరదలిని నా తరఫున చూసి సర్టిఫై చెయ్యాలి" అని అన్నాను... అనగానే అతడు నవ్వి చేయికలిపేడు. అందరూ కలకలా నవ్వేరు.

"అయితే అబ్బాయిగారు అమ్మాయిగారికి నచ్చినట్టే, కట్నాలూ, లాంఛనాలూ, పెట్టుపోతలూ, అడుగుతూ వాళ్ళ వాళ్ళకి కూడా ఉత్తరాలు వ్రాస్తే రెండు పెళ్ళిళ్ళూ ఒక్కమాటే శుభం మంగళాని భవతూ" అని కానివ్వొచ్చు అలస్యం దేనికి?" అని అత్తవారు అన్నారు.- అందరూ పట్టకంజా ఆనందించేరు. రెండోసారి చూపుల్లో — ఇద్దరమ్మాయిలూ కలిసి పాడి... బాగుందనిపించుకున్నారు... అందికే కళ్యాణం కలిసి వస్తే ఆగదంటారు!

—ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 14-5-60